


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -124 మంగళవారం 20 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts



పాఠకులకు ప్రకటనకర్తలు
శ్రేయోభిలాషులకు

విజయ దశమి
శుభాకాంక్షలు

నేడు దసరా పర్వదినం సందర్భంగా
పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు
(21 అక్టోబర్ బుధవారం ) సంచిక వెలువడదు ..
(పునర్దర్శనం గురువారం )

# పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే ప్రధానం

**భారత్ ఫ్యూచర్ సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డి**



**భారత్ ఫ్యూచర్ సిటీ విస్తరణకు పక్కా ప్రణాళిక**

**రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణం**

**గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేయాలి**

**రంగారెడ్డి, హైదరాబాద్ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాలు, సమర్థమైన పోలీసింగ్ వ్యవస్థతోనే ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించగలమని పేర్కొన్నారు. సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ మిగతాది 2లో...

## షూటింగ్‌లో స్వర్ణం, రజతం

**ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట షురూ..**

**ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు శుభారంభం**

**మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో మోనాకు స్వర్ణం**

**అవనీ లేఖరాకు రజత పతకం**

**గేమ్స్ రికార్డు స్కోర్‌తో స్వర్ణం సాధించిన మోనా అగర్వాల్**

**పోటీల తొలిరోజే పతకాల ఖాతా తెరిచిన భారత్**



**న్యూ ఢిల్లీ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న 2026 ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది. పోటీల తొలిరోజైన సోమవారం, భారత పారా షూటర్లు పతకాల వేట ప్రారంభించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 విభాగంలో భారత క్రీడాకారిణులు మోనా అగర్వాల్ స్వర్ణం, అవనీ లేఖరా రజతం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ గేమ్స్‌లో భారత్‌కు ఇవే తొలి పతకాలు కావడం విశేషం.హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా గేమ్స్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల స్వల్ప తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ అవనీ లేఖరా వెనుకబడింది. మిగతా 2లో.

## హైదరాబాద్‌లో హనీట్రాప్ కలకలం

**యువతిలా నటిస్తూ పోలీసు అధికారిని బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అరెస్ట్**

**వాట్సాప్‌లో పరిచయం పెంచుకుని డబ్బు డిమాండ్ చేసిన నిందితుడు**

**వందల మంది బాధితులు ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడి**

**ఇతర రాష్ట్రాలు, దుబాయ్‌లోనూ బాధితులు ఉన్నట్టు గుర్తింపు**

**నిందితుడి ఫోన్‌లో వేలకొద్దీ వాట్సాప్ చాటింగ్‌లు బట్టబయలు**



**హైదరాబాద్అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** నగరంలో సంచలనం సృష్టించిన హనీట్రాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. యువతిగా నటిస్తూ వాట్సాప్‌లో పరిచయం పెంచుకుని, ఏకంగా ఒక పోలీసు అధికారిని బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అనే నిందితుడిని సైదాబాద్ పోలీసులు మిగతాది 2లో...

## కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత..

**నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్**

**లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక**

**మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన**



## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

**మున్సిపల్ ఎన్నికలపై విపక్షాలకు లోకేశ్ చురకలు**

**ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన మిజోరం సీఎం లాల్‌దుహోమా**

**పురపాలక ఎన్నికలకు 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయన్న లోకేశ్**

**ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని చెప్పడానికి నిదర్శనమని వ్యాఖ్య**

**అమరావతిఅక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమానుమిగతాది 2లో...



# మంత్రుల కమిటీ

## కరవు, ఎల్ నినో ఎఫెక్ట్..

**రంగంలోకి దిగిన టీజీ ప్రభుత్వం, ఆరుగురు మంత్రులతో కమిటీ**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు**

**కమిటీలో మొత్తం ఆరుగురు మంత్రులకు చోటు**

**కరవు పరిస్థితులను పర్యవేక్షించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న కమిటీ**

**హైదరాబాద్ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో నెలకొన్న కరవు, ఎల్ నినో పరిస్థితులను సమీక్షించి, నివారణ చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరించనుండగా, ప్రణాళికా శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. మిగతాది 2లో...



# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

**ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ**

**అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు**

**గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి**

**అమరావతి అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించినమిగతాది 2లో...



## రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

**నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి: పవన్ కల్యాణ్**

**తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన**

**నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన**

**ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం క్షమించరాని నేరమన్న డిప్యూటీ సీఎం**

**'పల్లె పండుగ 3.0' కింద వారం క్రితమే రోడ్డు నిర్మాణం**



**అమరావతి అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, మిగతాది 2లో...

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ**

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు

# రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి.

(మొదటి పేజీ తరువాయి)

పుల్లంపేట మండలం అనంతసముద్రం-పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే రూ.4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.

# కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత..

**నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్**

**లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక**

**మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన**

అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.
కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు.
టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.



# 34 నెలల్లో 12.4లక్షల పాసు పుస్తకాలు ఇచ్చాం

**భూభారతితో ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం: పొంగులేటి**



**హైదరాబాద్, అక్టోబరు 19**భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 5,68,858, ఈ చట్టానికి ముందు 6,71,508 పాసు పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. మొత్తం ఈ 34 నెలల్లో 12,40,366 పాసు పుస్తకాలను రైతులకు అందించామని చెప్పారు. ప్రజలకు మెరుగైన, పారదర్శక రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపుతున్నామని అన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రెవెన్యూ గ్రామంలో రీ-సర్వే నిర్వహించి గిరిజనులు, గిరిజనేతరుల సమస్యను పరిష్కరించి 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో రీ-సర్వే ద్వారా 2,400 మంది రైతులకు 3,450ఎకరాలకు పట్టాలు ఇచ్చామన్నారు. ములుగు జిల్లా ముల్కాపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వరావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో ఈ రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించి త్వరలోనే హక్కుదారులకు పాసు పుస్తకాలు అందిస్తామన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు: సీతక్క



**హైదరాబాద్, అక్టోబరు 19** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి... గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా కృషి చేస్తానని మంత్రి సీతక్క తెలిపారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తగిన చర్యలపై సిఫారసు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీలో తనను సభ్యురాలిగా నియమించిన నేపథ్యంలో... పల్లెల్లో జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని సోమవారం మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవికి ముందే నీటి సమస్యలు గుర్తించడం, అందుబాటులో ఉన్న నీటివనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు... ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా అన్నిశాఖల సమన్వయంతో పనిచేస్తామని సీతక్క వెల్లడించారు.
కాగా, ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, విద్యుత్తు కొరత రాకుండా జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించుకోవాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్తు కోతలను అమలు చేయడం లేదని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ఆయన సూచించారు.

# మంత్రుల కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా కరవు పరిస్థితులను ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంది. సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తుంది. నైరుతి రుతుపవనాల సమయంలో రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అనేక మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కరవు నివారణ చర్యలపై దృష్టి సారించి, ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.

# నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు.
ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

# షూటింగ్‌లో స్వర్ణం, రజతం

(మొదటి పేజీ తరువాయి)

అవనీ 249.6 పాయింట్లతో రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి 227.9 పాయింట్లతో కాంస్య పతకం గెలుచుకుంది.
అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో కూడా భారత షూటర్లే ఆధిపత్యం ప్రదర్శించారు. మోనా అగర్వాల్ 629.1 పాయింట్లతో గేమ్స్ రికార్డు నెలకొల్పి అగ్రస్థానంలో నిలవగా, అవనీ లేఖరా 626.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలిరోజే రెండు పతకాలతో భారత్ ఈ మెగా ఈవెంట్‌లో తన ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించింది.

# పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే ప్రధానం

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) నూతన ప్రాంగణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
భారత్ ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఎన్ఐయూఎం ప్రాంగణాన్ని నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. 2028 జూన్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పర్యావరణహితంగా, నెట్‌జీరో లక్ష్యంతో భవనాలను నిర్మించనున్నట్లు చెప్పారు. పట్టణ పాలన, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరుల సమీకరణ, పట్టణ రవాణా, వాతావరణ మార్పులపై పరిశోధనలు చేపట్టడంతోపాటు అధికారులకు శిక్షణ ఇచ్చే కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.
ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే పోలీస్ కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఆధారాల విశ్లేషణ, మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఫ్యూచర్ సిటీ విస్తరణకు అనుగుణంగా పోలీసు జోన్లు, డివిజన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి, నిర్ణీత గడువుకు ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. కార్యక్రమాల్లో డీజీపీ సీవీ ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాల మోహరింపుపై వైసీపీకి ఎదురుదెబ్బ.. పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌కు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైసీపీ వేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ ఈరోజు కొట్టివేసింది. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు అవసరమని... రాష్ట్ర పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి, అక్టోబర్ 16న దానిని కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ వైసీపీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. విచారణ సందర్భంగా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోని పరిస్థితులతో ఏపీని పోల్చలేమని, ఇక్కడ పారామిలిటరీ బలగాల అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి కేంద్ర బలగాలను మోహరించేంత తీవ్రంగా లేదని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ డివిజన్ బెంచ్ కూడా అప్పీల్‌ను తోసిపుచ్చడంతో, స్థానిక ఎన్నికల భద్రత బాధ్యతలను రాష్ట్ర పోలీసులే నిర్వర్తించనున్నారు. దీంతో ఈ అంశంపై వైసీపీ చేసిన న్యాయపోరాటానికి నిరాశే ఎదురైంది.

# హైదరాబాద్‌లో హనీట్రాప్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)



అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వలలో వందలాది మంది బాధితులు చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పవన్ అనే యువకుడు వాట్సాప్‌లో యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, ఒక పోలీసు అధికారితో స్నేహం చేశాడు. చాటింగ్ ద్వారా కొంతకాలం నమ్మకాన్ని కలిగించిన అనంతరం, సదరు అధికారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే సోమవారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి, అతని నేర చరిత్రను వివరించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను విశ్లేషించగా వేల సంఖ్యలో వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. అతని బాధితుల జాబితాలో వందలాది మంది ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నిందితుడి మోసాల పరిధి కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాలతో పాటు దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నపోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# 22 ఏళ్ల విధేయతకు పట్టం..

## కక్కిరాలపల్లి కాంగ్రెస్ పగ్గాలు రవికుమార్‌కు!



**హనుమకొండ జిల్లా/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కక్కిరాలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రావుల రవికుమార్ నియమితులయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆయనను నియమించారు. 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరిన రవికుమార్ గత 22 ఏళ్లుగా పార్టీకి విధేయుడిగా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో పార్టీ మారాలంటూ పలు ప్రలోభాలు ఎదురైనా ఆయన కాంగ్రెస్‌ను వీడలేదు. అప్పటి పాలనలో కాంగ్రెస్ నుంచి ఏకైక వార్డు సభ్యుడిగా ఎన్నికైన రవికుమార్.. అధికార పార్టీ నాయకుల నుంచి ఇబ్బందులు ఎదురైనా ప్రజా సమస్యలపై పోరాడారు. గ్రామ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ అందరినీ కలుపుకొని వెళ్లే ఆయనకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

## గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు.

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.



# ఎమ్మెల్యే నాగరాజును కలిసిన మార్నేని రవీందర్‌రావు



**వర్ధన్నపేట/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును టీజీ క్యాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్, జిల్లా నాయకులు రుద్విక్‌రెడ్డి, కర్ర హరీష్‌రెడ్డి, వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ పాల్గొన్నారు.

# తల్లాడ చెక్‌పోస్టును తనిఖీ చేసిన విజిలెన్స్ సభ్యులు

## మార్కెట్ ఫీజు నిబంధనల ప్రకారం వసూలు చేయాలి

**తల్లాడ/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**



తల్లాడ వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టును వైరా వ్యవసాయ మార్కెట్ విజిలెన్స్ సభ్యులు నరేష్ కుమార్, వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ చెక్‌పోస్టులో రికార్డులు, ఫీజుల వసూలు తీరుపై పరిశీలన జరిపారు.ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, పత్తి, మిర్చికి సంబంధించి మార్కెట్ నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలని సూచించారు. మిర్చి పంటకు కూడా మార్కెట్లో నమోదవుతున్న ధరల ఆధారంగా నిబంధనలకు అనుగుణంగా ఫీజులు వసూలు చేయాలన్నారు.లైసెన్స్ లేకుండా ఎవరైనా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే మార్కెట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, మార్కెట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ తనిఖీల్లో నాగభూషణం, పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పేరుతో ప్రజా వ్యతిరేక పాలన!

**ఎన్నికల హామీలు గాలికి..**
**రైతులు, ప్రజలు సమస్యల సుడిగుండంలో**
**అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం**
**బీజేపీ కిసాన్ మోర్చా తీవ్రస్థాయి ధ్వజం..**
**విద్యుత్ సమస్యలపై ధర్నా**

**ఖమ్మం/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని బీజేపీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతులకు అండగా ఉంటామని, అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్.అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

**రైతులకు నాణ్యమైన విద్యుత్ ఏదీ?**
భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఖమ్మం ఎస్సీ విద్యుత్ కార్యాలయం వద్ద రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరుకుల్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్, సీనియర్ నాయకుడు మందడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సొంత బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు పంటలను కాపాడుకునే కీలక సమయంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయాల కారణంగా పంటలు ఎండిపోయే



పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ముందస్తు ప్రణాళికతో సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

**గోదావరి జలాలున్నా సాగునీటి కష్టాలే!**
గోదావరి జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడం ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోందని నాయకులు అన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు పంట నష్టాల నుంచి రక్షణ కల్పించాల్సిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఎండిపోతున్న పంటలను వెంటనే పరిశీలించి నష్టం అంచనా వేయడంతోపాటు బాధిత రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**ఎస్ఈకి వినతిపత్రం**
ధర్నా అనంతరం బీజేపీ ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా నాయకులు విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను కలిసి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని, తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను నివారించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారులు గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

**అన్ని రంగాల్లో వైఫల్యమే!**
వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, మౌలిక వసతులు సహా పలు రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని హితవు పలికారు.
రైతులు, ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. విద్యుత్, సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు తెప్పాల లక్ష్మీరెడ్డితో పాటు బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు చావా కిరణ్, మండేపూడి నాగేశ్వరరావు, ఆపతి వెంకట రామారావు, జ్వాలా నరసింహారావు, బెల్లం మురళి, మద్దినేని సతీష్, కొమ్మినేని కృష్ణారావు, వెంకటనారాయణ యాదవ్, బొల్లా రాంబాబు, రవి గౌడ్, పుప్పాల చంద్రమౌళి, మీగడ గోపి, కోటి హనుమంతరావు, రుద్రగాని మాధవ్, మృత్యుంజయరావు తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# అనంతసాగర్‌లో ఘర్షణ.. ఇద్దరిపై కేసు నమోదు

## దాడి, బైక్ ధ్వంసం, బెదిరింపులపై ఫిర్యాదు

**హసన్‌పర్తి/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**



హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో జరిగిన ఘర్షణకు సంబంధించి సుర రవి, ఆయన భార్య సుర శారదలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీ రాత్రి బతుకమ్మ వేడుకలకు వెళ్లేందుకు బైక్ వినియోగించే విషయమై అనంతసాగర్ గ్రామానికి చెందిన సుర సుజాత కుమారులు చందూ, శంకర్‌ల మధ్య వివాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన సుర రవి వారిపై దాడి చేసి గాయపరిచినట్లు, ప్రశ్నించిన సుజాతను దూషించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు.అనంతరం సుర రవి, ఆయన భార్య సుర శారద కలిసి కర్రలతో స్ప్లెండర్ బైక్‌ను ధ్వంసం చేయడంతో సుమారు రూ.3 వేల నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో జోక్యం చేసుకున్న రాజమౌళి, మహేందర్‌లను దూషించి, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడినట్లు కూడా ఆరోపణలు చేసినట్లు సమాచారం.బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.




# అక్రమ మట్టి దందాకు అడ్డుకట్ట వేయాలి

**మట్టి మాఫియా బెదిరింపులపై చర్యలు తీసుకోవాలి**
**సబ్ కలెక్టర్ తక్షణమే స్పందించాలి**
**బీజేపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ డిమాండ్**

**సత్తుపల్లి/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపును తక్షణమే నిలిపివేయాలని బీజేపీ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు కొమ్మేపల్లి నుంచి సత్తుపల్లివేంసూరు రహదారి మీదుగా జరుగుతున్న మట్టి తరలింపు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయనే ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు
మట్టి దందాపై ప్రశ్నించే వారిని బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని విజయ్ పేర్కొన్నారు ఈ అంశంపై ఫిర్యాదులు అందితే అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు అక్రమాలను ప్రశ్నించే ప్రజలకు రక్షణ కల్పించాలని ఫిర్యాదుదారులు నిర్భయంగా అధికారులను ఆశ్రయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు
దసరా పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సత్తుపల్లికి వస్తుండటంతో పట్టణంలో రద్దీ పెరిగిందని ఈ సమయంలో మట్టి టిప్పర్ల రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విజయ్ తెలిపారు ప్రజల











భద్రతను దృష్టిలో ఉంచుకొని వాహనాల రాకపోకలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు
సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తక్షణమే స్పందించి కొమ్మేపల్లి నుంచి సత్తుపల్లివేంసూరు రహదారి మీదుగా జరుగుతున్న మట్టి తవ్వకాలు, తరలింపుపై సమగ్ర విచారణకు ఆదేశించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు విచారణలో నిర్ధారణ అయితే సంబంధిత కార్యకలాపాలను నిలిపివేసి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సత్తుపల్లిలో అక్రమ మట్టి దందాకు అడ్డుకట్ట వేసి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని స్పష్టం చేశారు

అక్షరం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# హసన్‌పర్తి పరిధిలో వైద్యుడు అదృశ్యం

## భార్య ఫిర్యాదుతో కేసు నమోదు.. ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు



**హసన్‌పర్తి/ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన సివిల్ సర్జన్ డాక్టర్ పున్నం రమేష్ బాబు (44) అదృశ్యమైనట్లు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన భార్య, న్యాయవాది సపర్తి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ పున్నం రమేష్ బాబు హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్‌గా, పరకాలలోని సూర్య డయాగ్నోస్టిక్స్‌లో రేడియాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా ఆయన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ నెల 16న డయాగ్నోస్టిక్ కేంద్రం వద్ద కొందరు రుణదాతలతో వాగ్వాదం జరిగిన అనంతరం ఆయన హసన్‌పర్తిలోని ఇంటికి వచ్చారు.అనంతరం అక్టోబర్ 17న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదని, ఆయన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్‌లో ఉన్నాయని భార్య పోలీసులకు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదృశ్యమైన వైద్యుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.అదృశ్యమైన డాక్టర్ పున్నం రమేష్ బాబు వయస్సు 44 సంవత్సరాలు. ఎత్తు సుమారు 5 అడుగుల 10 అంగుళాలు. నల్లటి మేనిఛాయ, పొడవైన ముఖం, నల్లటి జుట్టు కలిగి ఉంటారు. అదృశ్యమైన సమయంలో నీలం రంగు జీన్స్ ప్యాంటు, నీలం రంగు షర్టు ధరించినట్లు పోలీసులు తెలిపారు.పై ఆనవాళ్లు కలిగిన వ్యక్తి కనిపించినా, ఆయన ఆచూకీకి సంబంధించి ఏదైనా సమాచారం తెలిసినా వెంటనే హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు లేదా సమీప పోలీసులకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి సందడి!

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ





**తల్లాడ/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో జక్కంపూడి విగ్రహ ప్రాంగణంలో సర్పంచి ఎన్నిక కృష్ణవేణి నరసింహారావు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా నాయకుడు జక్కంపూడి కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఆడబిడ్డల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య పండుగలను జరుపుకోవడం ద్వారా మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవచ్చని అన్నారు.

రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడి చేశారు. దీంతో జక్కంపూడి విగ్రహ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడంతో సంబరాలు మరింత ఉత్సాహంగా సాగాయి. గ్రామస్థులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, జక్కంపూడి కిషోర్, సామినేని రామ్ అప్పారావు, వెంకటేశ్వర్లు, జక్కంపూడి చంద్రశేఖర్, రమేష్, నాగేశ్వరరావు, నరసింహులు, దీవెల కృష్ణయ్య, నాగుల్ మేరా, రామకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్థులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయంలో ఘనంగా కుంకుమ పూజ

## శ్రీ మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు





**స్టేషన్ ఘన్‌పూర్/ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.అర్చకుడు జీడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, జలాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చన, హోమం తదితర ధార్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో పండగ బుచ్చయ్య, అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు, భవానీ మాల స్వాములు పండగ రాజేశ్వర్, పర్శ రాజు, పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్, శ్రీపతి రాజు, నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్థి, మారపాక మానస (సుబ్బులు) తదితర భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# రూ.81.50 లక్షల నగదు లావాదేవీల వివాదం!

### వడ్డీ ఇస్తామంటూ డబ్బులు తీసుకున్నారని రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఆరోపణ

### దంపతుల ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి బాధితుడి నిరసన



**సత్తుపల్లి/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో రూ.81.50 లక్షల నగదు లావాదేవీలకు సంబంధించిన వివాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలుదఫాలుగా నగదు తీసుకుని తిరిగి చెల్లించడం లేదని ఆరోపిస్తూ ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులతో కలిసి రుణగ్రహీతల ఇంటి ఎదుట నిరసనకు దిగారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

బాధితుడు చింతమాల వెంకటేశ్వర్లు వేంసూరు మండలం అదర్లపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు. ప్రస్తుతం సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులో ఏపీజీబీ బ్యాంకు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. అదే అపార్ట్‌మెంట్‌లోని మరో పోర్షన్‌లో నివసించే సూరవర్జుల చంద్రశేఖర్, స్వప్న దంపతులతో ఆయనకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో వివిధ అవసరాల పేరుతో 2025 నవంబర్ 20 నుంచి 2026 ఫిబ్రవరి 22 వరకు పలుదఫాలుగా రూ.81.50 లక్షలు తీసుకున్నారని వెంకటేశ్వర్లు ఆరోపించారు.

తన వద్ద నుంచి నగదు తీసుకునే సమయంలో వడ్డీ చెల్లిస్తామని చెప్పారని, అయితే తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకుంటున్నారని బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయమై తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ ఇప్పటికే సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నగదు లావాదేవీలకు సంబంధించిన వివాదాన్ని న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించినట్లు బాధితుడు వెల్లడించారు.

తనకు రావాల్సిన నగదు తిరిగి అందకపోవడంతో బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్డు, కాకతీయ నగర్‌లో ఉన్న దంపతుల ఇంటి ఎదుట నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ నగదు వివాదంపై సంబంధిత పక్షాల వాదనలు, పోలీసుల తదుపరి చర్యలు తెలియాల్సి ఉంది.

# తెలుగు ప్రజలకు కాంగ్రెస్ నాయకుల విజయదశమి శుభాకాంక్షలు



**తల్లాడ/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు ప్రజలందరికీ తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్, గుండేటి వీరారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం నింపాలని గుండేటి వీరారెడ్డి మనస్ఫూర్తిగా కోరుకున్నారు. తెలుగు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

# పుట్టినరోజు సందర్భంగా మానసిక దివ్యాంగ పిల్లలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ

## సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు




**మధిర/ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** మధిర పట్టణ విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు తన సతీమణి స్వప్న పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనంలో డాక్టర్ హరి చందనతో కలిసి మానసిక దివ్యాంగ పిల్లలకు శీతాకాలంలో ఉపయోగపడే ఉన్ని దుప్పట్లు, రగ్గులు, బిస్కెట్లు, చాక్లెట్లు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు. పుట్టినరోజు వేడుకలను సేవాసదనంలోని చిన్నారులతో పంచుకుంటూ వారికి అవసరమైన వస్తువులను అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా స్వప్నకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. బండి శ్రీనివాసరావు ఉద్యోగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, డాక్టర్ హరి చందన ఎండీ పూర్తి చేసి వైద్య వృత్తిలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మానసిక దివ్యాంగ పిల్లల తరఫున ఆకాంక్షించారు.

పుట్టినరోజు వేడుకలను సేవాసదనంలోని పిల్లల మధ్య జరుపుకుంటూ వారికి దుప్పట్లు, స్నాక్స్ అందించి అన్నదానం చేసినందుకు బండి శ్రీనివాసరావు, స్వప్న, డాక్టర్ హరి చందనలకు సేవాసదనం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు, రిటైర్డ్ ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై రాజ్‌కుమార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల సత్కారం



**పర్వతగిరి/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రాజ్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ, జిల్లా మాజీ కార్యదర్శి ధర్మయ్య మాదిగ, నూతన మండల అధ్యక్షుడు బొట్ల కుమార్ మాదిగ, మండల అధికార ప్రతినిధి మాసాని రమేష్ మాదిగ, డాక్టర్ శ్రీనివాస్ మాదిగ, మహంకాళి మొగిలి మాదిగ, 8వ వార్డు సభ్యుడు మాసాని భాస్కర్ మాదిగ, పర్వతగిరి పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ, మాజీ వార్డు సభ్యుడు మాసాని కమలహాసన్ మాదిగ, ఇమ్మడి అశోక్ మాదిగ, మాసాని నిరంజన్ మాదిగ, మాసాని రవీందర్ మాదిగ, మాసాని సునీల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కూడలి వద్ద రావణ వధకు అనుమతులు ఇవ్వొద్దు

## ఎల్కతుర్తి సీఐకి దళిత సంఘాల ఐక్యవేదిక ఫిర్యాదు -ప్రజల మనోభావాలు, సామాజిక సామరస్యాన్ని కాపాడాలి



**ఎల్కతుర్తి/ అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద రావణ వధ కార్యక్రమం నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు పోలీసులను కోరారు. ఈ మేరకు ఆదివారం ఎల్కతుర్తి సీఐ, ఎస్ఐలకు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ఫిర్యాదు సమర్పించారు.తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్ సూచనల మేరకు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఇసంపెల్లి రమేష్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గొర్రె థామస్, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బొంకురి రాజు పోలీసులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని, సామాజిక సామరస్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏ కార్యక్రమమైనా ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వహించాలని సూచించారు.రావణుడి చరిత్రకు సంబంధించి భిన్నమైన అభిప్రాయాలు ఉన్న నేపథ్యంలో, ఆయనను కించపరిచే విధంగా కార్యక్రమాలు నిర్వహించడంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు. ఈ అంశంలో ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని, చట్టపరంగా తగిన నిర్ణయం తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

అంబేద్కర్ సంఘానికి ఏ మతం పట్ల గానీ, ఏ రాజకీయ పార్టీ పట్ల గానీ వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. సమాజంలో సమానత్వం, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. వివాదాలకు తావులేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.అంబేద్కర్ కూడలి వద్ద మతపరమైన, రాజకీయపరమైన వివాదాలకు దారితీసే కార్యక్రమాలు నిర్వహించకుండా చూడాలని, మహనీయుల ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలు జరగాలని కోరారు. అంబేద్కర్ కూడలి వద్ద రావణ వధ కార్యక్రమానికి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు మంజూరు చేయకూడదని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఆర్యరాజు, ఎల్కతుర్తి మండల ఉపాధ్యక్షుడు గొర్రె తిరుపతి, మండల సంయుక్త కార్యదర్శి చిలుముల ప్రమోద్, బౌద్ధ సంఘానికి చెందిన కామెర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి అనుమానితుల గుర్తింపు సర్వేకు ప్రజలు సహకరించాలి

## ఈ నెల 22 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం -జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆలం అప్పయ్య

**హనుమకొండ/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లాలో కుష్టు వ్యాధి అనుమానితులను ముందస్తుగా గుర్తించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఈ నెల 22వ తేదీ గురువారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆలం అప్పయ్య తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కుష్టు వ్యాధి అనుమానితుల గుర్తింపు కోసం రూపొందించిన ఫ్లాష్ కార్డును ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ అక్టోబర్ 22 నుంచి ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

**లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు**

శరీరంపై పాలిపోయిన లేదా ఎర్రటి మచ్చలు ఏర్పడటం, ఆ ప్రాంతంలో స్పర్శ జ్ఞానం తగ్గడం, చేతులు, కాళ్లలో తిమ్మిరి, మొద్దుబారిన భావన, కండరాల బలహీనత వంటి లక్షణాలు కుష్టు వ్యాధికి సూచనలు కావచ్చని వైద్యాధికారులు తెలిపారు. ఈ లక్షణాలు కనిపించినంత



మాత్రాన కుష్టు వ్యాధి ఉన్నట్లు నిర్ధారించలేమని, వైద్య పరీక్షల ద్వారానే వ్యాధిని నిర్ధారించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**తొలిదశలో చికిత్సతో వైకల్యాలకు అడ్డుకట్ట**

కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి వైద్యుల సూచనల మేరకు బహుళ ఔషధ చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చని వైద్యాధికారులు తెలిపారు. చికిత్సలో జాప్యం జరిగితే నరాలు దెబ్బతినడం, చేతులు, కాళ్లలో స్పర్శ జ్ఞానం కోల్పోవడం, వైకల్యాలు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కుష్టు వ్యాధి గురించి సమాజంలో ఉన్న అపోహలను తొలగించాలని, బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని కోరారు. సాధారణంగా కరచాలనం చేయడం, పక్కపక్కన కూర్చోవడం, కలిసి భోజనం చేయడం ద్వారా ఈ వ్యాధి వ్యాపించదని వివరించారు.

**ఆశా కార్యకర్తలకు సహకరించాలి**

ఇంటింటి సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆలం అప్పయ్య విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు వచ్చే ఆశా కార్యకర్తలకు కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలియజేసి, అనుమానిత లక్షణాలు ఉన్నవారు వైద్య పరీక్షలు చేయించుకునేలా సహకరించాలని సూచించారు. సర్వేలో గుర్తించిన అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స అందించేందుకు ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ ప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లయ్య, హెల్త్ సూపర్వైజర్ సులోచన, హెల్త్ అసిస్టెంట్లు కృష్ణమూర్తి, సత్యప్రకాష్, నర్సింగ్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, 40 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయదశమి వేళ రావణాసుర వధకు సన్నాహాలు

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో పండుగ సందడిడ చెడుపై మంచి విజయానికి ప్రతీకగా రావణ దహనం**

**గ్రామగ్రామాన ఏర్పాట్లుడ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే వేడుకలు**

**వరంగల్ /ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు నేడు మంగళవారం రావణాసుర వధ కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. దసరా పండుగను వైభవంగా జరుపుకునేందుకు గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. రావణాసురుడి భారీ ప్రతిమల తయారీ, వేడుకలు నిర్వహించే ప్రాంగణాల సిద్ధం, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయడం వంటి కార్యక్రమాలతో పండుగ సందడి నెలకొంటోంది.

**చెడుపై మంచి విజయానికి ప్రతీకగా విజయదశమి**

హిందూ పురాణాల ప్రకారం శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించిన సందర్భాన్ని విజయదశమిగా జరుపుకుంటారు. అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణాసుర వధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రావణుడి ప్రతిమను దహనం చేయడం ద్వారా చెడు ఆలోచనలను విడనాడి సత్యం, ధర్మం, న్యాయం వైపు నడవాలనే



సందేశాన్ని ప్రజలకు అందిస్తారు. పిల్లలు, యువతకు రామాయణంలోని విలువలను పరిచయం చేయడానికి ఈ వేడుకలు వేదికగా నిలుస్తాయి.

**గ్రామాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల పరిధిలో విజయదశమి వేడుకల కోసం ఆయా గ్రామాల ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల సంప్రదాయాలకు అనుగుణంగా రావణాసురుడి ప్రతిమల ఏర్పాటు, కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై నిర్వాహకులు దృష్టి సారిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

**కుటుంబాలతో కలిసి వేడుకలను తిలకించేందుకు ఆసక్తి**

విజయదశమి వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి తిలకించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. చిన్నారులకు పండుగ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు భారతీయ పురాణ గాథలు, సంప్రదాయాల గురించి తెలియజేయడానికి ఈ వేడుకలు ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో సామూహికంగా జరిగే కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతున్నాయి.

**భద్రతపై అప్రమత్తత అవసరం**

రావణాసుర దహనం సందర్భంగా నిర్వాహకులు అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు నిలబడే ప్రదేశానికి దహన వేదికను దూరంగా ఏర్పాటు చేయడం, అగ్నిమాపక ఏర్పాట్లు సిద్ధంగా ఉంచడం, పోలీసుల సూచనలు పాటించడం అవసరం. చిన్నారులను అగ్నికి దగ్గరగా వెళ్లకుండా చూడాలి. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని తగ్గించి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి.

**చెడును విడనాడటమే విజయదశమి సందేశం**

రావణాసుర వధ కేవలం ఒక ఆచార కార్యక్రమం మాత్రమే కాకుండా చెడు ఆలోచనలు, అహంకారం, అన్యాయం, అధర్మాన్ని విడనాడాలనే సందేశాన్ని అందించే సంప్రదాయం. సమాజంలో సత్యం, న్యాయం, పరస్పర గౌరవం, మానవత్వం పెంపొందినప్పుడే విజయదశమి పండుగ స్ఫూర్తి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది. ఈ సందేశంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో నేడు మంగళవారం రావణాసుర వధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు

# లీలా సుందరయ్య నగర్‌లో

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**వైరా/అక్టోబర్ 19(జర్నలిస్ట్ వార్త);**వైరా మున్సిపాలిటీ పరిధిలోని లీలా సుందరయ్య నగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, బుర్ర రాజశేఖర్ హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. వీరితోపాటు స్థానిక కమిటీ సభ్యులు, మహిళలు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన స్థానిక కమిటీ సభ్యులకు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు



# నరుకుడు రవీందర్ మాదిగకు ఘన నివాళి



**పర్వతగిరి/అక్టోబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరుకుడు రవీందర్ మాదిగ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మార్పీఎస్‌ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగతో పాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పర్వతగిరి మండల మహిళా అధ్యక్షురాలు మాసాని సువార్త, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గోలి సుధాకర్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా సీనియర్ నాయకుడు తాటికాయల కుమార్, బిర్రు రవీందర్ మాదిగ, బుర్రు పీటీ సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

# రేవంత్ సర్కార్‌పై రూ.50 వేల కోట్ల స్కాం ఆరోపణలు.. సీబీఐ విచారణకు క్రిశాంక్ డిమాండ్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ అండతో రూ.50,000 కోట్ల విలువైన కుంభకోణాలు జరిగాయని, ముఖ్యంగా సెక్షన్ 22ఏ కింద ఉన్న నిషేధిత భూముల వ్యవహారంలో భారీగా అవినీతి చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేకపోతే, వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ లో మీడియాతో క్రిశాంక్ మాట్లాడుతూ... ఈ భూ సెటిల్‌మెంట్ల వెనుక సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను బెదిరించడమే కాకుండా, భూదందాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. చేవెళ్ల పరిధిలోని చందన్‌వల్లి గ్రామంలో సర్వే నంబర్ 363లోని అసైన్డ్ భూమిని వ్యవసాయ భూమిగా మార్చి, ఆర్9 కన్‌స్ట్రక్షన్స్ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ కంపెనీలో కృష్ణారెడ్డి భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. ఇలాంటి భూ కబ్జాల కోసమే సెక్షన్ 22ఏను వాడుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గానికి నిధులు కావాలంటే కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా క్రిశాంక్ గుర్తుచేశారు. ఇదే సమయంలో ఒక ఆసుపత్రి అమ్మకం, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ కార్పొరేట్ స్కూళ్లతో సీఎం కుటుంబ సభ్యులకు ఉన్న సంబంధాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఆరోపణలపై బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ప్రశ్నించారు. ఈ కుంభకోణాలపై తమ వద్ద ఉన్న అన్ని పత్రాలు, డైరెక్టర్ల వివరాలు, వాటాల సమాచారాన్ని సీబీఐకి సమర్పించడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, దమ్ముంటే విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు.

# పూల సోయగం.. పాటల సందడి..

**తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ అందం!**

**ఆడపడుచుల ఆటపాటలతో అంబరాన్నంటిన సంబరాలు..**

**తరతరాలను కలిపే అపురూప సంప్రదాయం**







**తెలంగాణ/అక్టోబర్ 19(జర్నలిస్ట్ వార్త):**
తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు.. ఆడపడుచుల ఆటపాటలు. జానపద గీతాల హోరు. ఆత్మీయ పలకరింపులు. వెరసి తెలంగాణ అంతటా పండుగ శోభను నింపిన బతుకమ్మ సంబరాలు నిన్నటితో ఘనంగా ముగిశాయి. సద్దుల బతుకమ్మ నిమజ్జనంతో వేడుకలకు వీడ్కోలు పలికినా. పూల పండుగ అందించిన ఆనందం, ఆత్మీయత, సాంస్కృతిక వైభవం ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రకృతి అందాలకు ప్రతిరూపాలుగా నిలిచాయి. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి పాడిన పాటలు, వేసిన కోలాటాలు పల్లెలు, పట్టణాల్లో సందడి నింపాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ వేడుకల్లో భాగస్వాములు కావడం పండుగ ప్రత్యేకతను చాటిచెప్పింది.

**ఐక్యతకు ప్రతీక.. ఆత్మీయతకు వేదిక!**

బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాల బలానికి ప్రతీకగా నిలిచింది. ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉండే మహిళలకు ఆత్మీయులతో కలిసి ఆనందంగా గడిపే అవకాశాన్ని కల్పించింది. తరతరాలుగా వస్తున్న జానపద పాటలు, పూజా సంప్రదాయాలు భావితరాలకు అందించే వేదికగా నిలిచింది. తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణవాసులు సైతం బతుకమ్మ వేడుకలు నిర్వహించడం మన సంస్కృతిపై వారికున్న అభిమానానికి నిదర్శనం.

**ప్రకృతిని ప్రేమిద్దాం. సంప్రదాయాన్ని కాపాడుకుందాం!**

ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మను పేర్చడం పర్యావరణంతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. స్థానిక పూల వినియోగం, పూల సాగు చేసే రైతులకు ప్రోత్సాహం, చెరువుల పరిరక్షణ వంటి అంశాలకు బతుకమ్మ స్ఫూర్తినిస్తుంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూ ప్రకృతిని కాపాడుకోవాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది.

బతుకమ్మ సంబరాలు ముగిసినా. వాటి వెనుక ఉన్న ఆనందం, ఐక్యత, ఆత్మీయత నిరంతరం కొనసాగాలి. మన సంస్కృతిని భావితరాలకు అందిస్తూ, మహిళల గౌరవాన్ని చాటుతూ, ప్రకృతిని పరిరక్షిస్తూ ముందుకు సాగాలి.

పూలతో పేర్చిన బతుకమ్మ. పాటలతో పరవశించిన తెలంగాణ. ఆత్మీయతతో ఒక్కటైన ఆడపడుచులు.. ఇదే బతుకమ్మ పండుగ గొప్పతనం! తెలంగాణ సంస్కృతి ఉన్నంతకాలం బతుకమ్మ వైభవం తరతరాలకు కొనసాగుతూనే ఉంటుంది.









# పునర్విభజనతో ఆర్థిక భారం



దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశం లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు పదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్‌డిఎ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం.ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్‌డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు.ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి.

## పండగల వేళ హైదరాబాద్ పోలీసు శాఖలో మార్పులు.. భారీగా ఎస్ఐల బదిలీ




హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది.బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి

# వ్యర్థాలతో అనర్థాలు



అరచేతిలో ప్రపంచం.. అడుగడుగునా సాంకేతికత.. నిమిషాల్లో సమాచార మార్పిడి.. క్షణాల్లో పనుల పూర్తి! ఇదీ నేటి డిజిటల్ యుగం తీరు. ఒకప్పుడు విలాస వస్తువులుగా ఉన్న సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు నేడు ప్రతి ఇంటి అవసరాలుగా మారాయి. సాంకేతికత పెరిగింది.. సౌకర్యాలు పెరిగాయి.. జీవితం వేగం పుంజుకుంది. కానీ, ఈ అభివృద్ధి వెనుక మరో ముప్పు నిశ్శబ్దంగా పొంచి ఉంది. అదే ఈ -వ్యర్థాల సమస్య! సాంకేతిక పరికరాలను తరచూ మార్చుకోవాలనే ఆసక్తి, కొత్త మోడళ్లపై మోజు, మరమ్మతులు చేయించుకోవడం కంటే కొత్త పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ- వ్యర్థాలు పెరగడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. దీనికి తోడు పాత ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలా సేకరించాలి? ఎక్కడ అప్పగించాలి? అనే విషయాలపై ప్రజల్లో తగిన అవగాహన లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్ల టన్నుల ఈ- వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని సక్రమంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయకపోతే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎలక్ట్రానిక్ పరికరాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి హానికర పదార్థాలు ఉంటాయి. వీటిని సాధారణ చెత్తతో కలిపి పారేయడం, బహిరంగంగా కాల్చడం వల్ల నేల, నీరు, గాలి కలుషితమయ్యే ప్రమాదం ఉంది.ఈ కాలుష్యం మానవ ఆరోగ్యంపై, ముఖ్యంగా నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, శ్వాసకోశంపై ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అందుకే ఈ -వ్యర్థాల నిర్వహణ కేవలం పర్యావరణ సమస్యే కాదు.. ప్రజారోగ్యానికి సంబంధించిన కీలక అంశం కూడా. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సిపిసిబి) గణాంకాల ప్రకారం, భారతదేశంలో ఈ -వ్యర్థాల ఉత్పత్తి 2023 -24లో సుమారు 12.54 లక్షల టన్నులుగా ఉండగా, 2024 -25లో సుమారు 13.98 లక్షల టన్నులకు పెరిగింది. అంటే, ఏడాదిలోనే వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరిగింది.అదే సమయంలో సేకరణ, రీసైక్లింగ్ తదితర నిర్వహణకు సంబంధించిన నివేదిత శాతం 61.94 నుంచి 70.71 శాతానికి పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది కొంత సానుకూల పరిణామమే అయినప్పటికీ, మిగిలిన వ్యర్థాలను కూడా సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ -వ్యర్థాల నిర్వహణలో తెలంగాణ కూడా ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలో నమోదైన ఈ- వ్యర్థాల రీసైక్లర్ల సంఖ్య 2023- 24లో 14 ఉండగా, 2024- 25లో 19కి పెరిగింది. హైదరాబాద్‌లో ఈ- వ్యర్థాల రీసైక్లింగ్ సాంకేతికతల అభివృద్ధికి ప్రత్యేక జవత్‌తీవ శీట జుఇఎవశ్రీశ్రీవఅఎవ ఏర్పాటు చేయడం ఈ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. అయితే, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ప్రతి ఇంటినుంచి వ్యర్థాలు అధికారిక సేకరణ వ్యవస్థకు చేరేలా చర్యలు తీసుకోవాలి. ఈ- వ్యర్థాలు పూర్తిగా పనికిరాని చెత్తకాదు. వాటిలో బంగారం, వెండి, రాగి, అల్యూమినియం, పల్లాడియం వంటి 17 రకాల విలువైన లోహాలు ఉంటాయి. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వీటిని తిరిగి వెలికితీసి వినియోగించుకోవచ్చు. అలాగే కొన్ని పరికరాల్లోని భాగాలను మరమ్మతు చేసి తిరిగి ఉపయోగించవచ్చు.ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి విలువైన పదార్థాలను తిరిగి పొందడం వల్ల సర్క్యులర్ ఎకానమీకి బలమైన వనరుగా మారడంతో పాటు సహజ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది.కొత్త లోహాల తవ్వకం, శుద్ధి కోసం అవసరమయ్యే శక్తి, ముడిసరుకుల వినియోగాన్ని కూడా కొంత మేర తగ్గించవచ్చు.ఈ విషయాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఉదాహరణ టోక్యో ఒలింపిక్స్. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అథ్లెట్లకు అందించిన పతకాల తయారీకి ప్రజల నుంచి సేకరించిన పాత ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి తిరిగి పొందిన లోహాలను ఉపయోగించారు. వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చవచ్చని జపాన్ ప్రపంచానికి చాటిచెప్పింది. ఇదే స్ఫూర్తితో మనమూ 'వేస్ట్ టు వెల్త్' భావనను ఆచరణలోకి తీసుకురావాలి. భారతదేశంలో ఈ -వ్యర్థాల నిర్వహణకు సంబంధించి తొలిసారిగా 2011లో నిబంధనలు తీసుకొచ్చారు. అనంతరం 2016లో కొత్త నిబంధనలు రూపొందించి, 2018లో సవరణలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి 2022 నిబంధనలు 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లో ఉన్నాయి. ఈ నిబంధనల్లో 'విస్తరించిన ఉత్పత్తిదారుల బాధ్యతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. అంటే, ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేసే సంస్థలు వాటి వినియోగం ముగిసిన తర్వాత ఏర్పడే వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ బాధ్యతలను నిబంధనలకు అనుగుణంగా నిర్వర్తించాలి. సిపిసిబి నిర్వహించే ఈ- వ్యర్థాల ఇపిఆర్ పోర్టల్ ద్వారా సంబంధిత సంస్థల నమోదు, రీసైక్లింగ్ బాధ్యతల పర్యవేక్షణకు వ్యవస్థ ఉంది.అయితే, చట్టాలు చేయడం ఎంత ముఖ్యమో వాటిని సమర్థంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ప్రజలు, ఉత్పత్తిదారులు, రీసైక్లర్లు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. ఈ -వ్యర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో పాఠశాలలు, కళాశాలలు కీలక పాత్ర పోషించాలి. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల వర్గీకరణ, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించాలి. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఈ -వ్యర్థాలపై అవగాహన కల్పిస్తే ఈ కార్యక్రమం మరింత విస్తృతమవుతుంది. ఇలా చిన్న స్థాయిలో ప్రారంభమైన ప్రయత్నాలు పెద్ద సామాజిక మార్పునకు దారితీస్తాయి. సాంకేతిక అభివృద్ధిని ఆపడం సాధ్యం కాదు. కానీ దాని వల్ల ఏర్పడే వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం మన చేతుల్లోనే ఉంది. ఈ -వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారేస్తే అవి పర్యావరణానికి ముప్పుగా మారతాయి. అదే శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి, పునర్వినియోగించి, రీసైక్లింగ్ చేస్తే విలువైన వనరులుగా మారతాయి.

# కడలి తరగలను ఆపగలరా!

'ఢిల్లీ హైకోర్టు ప్రధానద్వారం వద్ద మేము ధర్నా చేస్తాం. అక్కడ పాదచారుల సౌకర్యం కోసం అవసరమైన ఫుట్‌పాత్‌లు నిర్మించకపోతే ధర్నా తప్పదు. మాతోపాటు ప్రభుత్వ అధికారిని కూడా ఇంటికి వెళ్లనివ్వకుండా ధర్నాలో కూర్చోబెడతాం' ఈ మాటలన్నది పాలనతో విసుగు చెందిన ఏ సామాన్య పౌరులో కాదు. సాక్షాత్తూ సుప్రీం కోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం పాదచారులు సురక్షితంగా నడవడానికి అవసరమైన ఫుట్‌పాత్‌లు ప్రజల ప్రాథమిక హక్కు అని ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ కేవీ వినోద్ చంద్రన్ వ్యాఖ్యానించారు. హాస్యానికి అంటున్నట్టు కనిపించినా ఈ న్యాయమూర్తుల ప్రకటనలో ఒక హెచ్చరిక ధ్వనించింది. ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నోటివెంట ధర్నా అనే మాట ఎందుకు వచ్చింది? ఏదైనా సమస్య పరిష్కారం నోచుకోకుండా ఉన్నప్పుడు ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించడానికి సాధారణంగా సామాన్య ప్రజలు చేసే పని.. ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించడం. ఇవి ప్రజాస్వామ్యంలో ప్రజల శాంతియుత పోరాటానికి ఉద్దేశించిన ఆయుధాలు. అయితే శాంతియుతంగా నిరసన చేస్తున్న క్రమంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జైహింద్ అని నినదించడానికి సిద్ధపడిన యువకులను శాంతిని భంగం చేస్తున్నారని పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక విచిత్రమైన ఘట్టం. బ్రిటన్, కెనడా తదితర దేశాల్లో కాక్రోచ్ జనతా పార్టీ పోరాటానికి మద్దతుగా భారత సంతతికి చెందిన యువతీ యువకులు త్రివర్ణ పతాకాన్ని వీధుల్లో స్వేచ్ఛగా ఎగరేస్తుంటే, తాము తప్ప ఎవరూ దేశభక్తులు కారని చెప్పుకునే పార్టీ అధికారంలో ఉన్న భారతదేశంలో జాతీయ పతాకాన్ని ఎగరేస్తే అరెస్టులా! న్యాయమూర్తులే రోడ్డెక్కి నిరసనలు తెలపడానికి సిద్ధపడుతుంటే ఇక సామాన్యుల గురించి వేరే చెప్పాలా!ఈ దేశంలోని యువత పలు సమస్యల మీద ఆందోళన ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించే ప్రయత్నాల్లో భాగంగా శాంతియుత పద్ధతుల్లోనే రకరకాల ప్రక్రియల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నది. ప్రతి చోటా.. అది దేశ రాజధాని ఢిల్లీ కావచ్చు, ఇతర రాష్ట్రాల్లోని రాజధానులు, నగరాలు, పట్టణాల్లో కావచ్చు. ప్రభుత్వాలు ఇలాంటి నిరసనలు తెలపడానికి ఒక ప్రదేశాన్ని కేటాయించడం ఆనవాయితీ అయిపోయింది. మీకేదైనా సమస్య ఉంటే ఫలానాచోట మాత్రం కూర్చొని నిరసన తెల్పడమో, ప్రభుత్వాన్ని నిలదీయడమో చేయాలని నిర్దేశించడమే హాస్యాస్పదంగా ఉంటుంది.గత 50, 60 ఏళ్ళ హైదరాబాద్ నగర చరిత్ర తెలిసినవాళ్ళు ఎవరికైనా గుర్తుండే ఉంటుంది.. ముఖ్యంగా ఆనాటి రాజకీయ నాయకులకు, పాత్రికేయులకు, సెక్రటేరియట్ గేట్ ఎదురుగానే ప్రస్తుతం లుంబినీ పార్కు ఉన్న ప్రదేశంలో సంవత్సరానికి మూడువందల అరవై ఐదు రోజులూ నిరసన శిబిరాలు ఉండేవి. ఉద్యోగవర్గాలు, కార్మికులు, వామపక్షాలు ఇతర అనేకమంది తమతమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్లకార్డులు చేతబట్టుకుని, బ్యానర్లు ఏర్పాటు చేసి నిరసన దీక్షలు పూనడం సర్వసాధారణంగా కనిపించేది. ఆ తర్వాత కాలంలో అభివృద్ధికి చిహ్నంగా మనం గొప్పలు చెప్పుకునే రోడ్ల విస్తరణ జరిగి సచివాలయం చుట్టూ సుందరీకరణ పేరిట ఈ శిబిరాలన్నిటినీ ఎత్తేసి సచివాలయానికి కనిపించనంత దూరంలో ఎక్కడో ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్ అని ఒకటి ఏర్పాటు చేశారు. సచివాలయం ఎదురుగా ఈ నిరసనలు జరుగుతున్న కాలంలో సచివాలయంలోకి వెళ్తూ, బయటకు వస్తూ మంత్రులు, అధికారులు.. అలాగే చాలా కొన్ని సందర్భాల్లో ముఖ్యమంత్రులు కూడా ఈ శిబిరాల వద్ద తమ వాహనాలను నిలిపి దిగి వెళ్లి నిరసనకారులను పలకరించి వారితో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన సందర్భాలు అనేకం పత్రికలవారికి బాగా గుర్తుంటాయి. అప్పట్లో ఈ నిరసన కార్యక్రమాలను కవర్ చేయడానికి వెళ్ళిన విలేకరులను ఎవరిని అడిగినా చెప్తారు ఈ విషయం.అటువంటిది తర్వాత కాలంలో ఒకసారి ఎన్నికై అధికారంలోకి వచ్చాక ఐదేళ్లపాటు అసలు ఈ నిరసనలు అనేవి వినిపించకూడదు, కనిపించకూడదు అనే ధోరణి రాజకీయ వ్యవస్థలో ప్రబలిపోయిన తర్వాత ఈ నిరసన శిబిరాలు సచివాలయాల ముందునుండి లేదా ఢిల్లీ పార్లమెంటు భవనం సమీపంనుండి కొంత దూరానికి తరలివెళ్లాయి. హైదరాబాద్ లో ఇందిరా పార్క్, బెంగళూరులో ఫ్రీడమ్ పార్క్, ఢిల్లీలో జంతర్ మంతర్ ఇలా అధికార ప్రాంగణాలకు, పాలకులకు కనిపించనంత దూరంగా విసిరిపడేసారు. దాదాపు 13 ఏళ్ళపాటు సుదీర్ఘ పోరాటం జరిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి రాగానే ఇందిరా పార్క్ దగ్గర ఉన్న ధర్నాచౌక్‌ను ఎత్తేసి శంషాబాద్ అవతల ఎక్కడికో తరలించిన విషయం అందరికీ తెలిసిందే. ప్రజాస్వామ్యవాదులు చేసిన సుదీర్ఘ పోరాటం తరువాత, న్యాయస్థానాల జోక్యం తరువాతగానీ మళ్ళీ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ పునరుద్ధరణ జరగలేదు. పోరాటాలు, ప్రతిఘటనల పునాదుల్లో నుండి పుట్టిన నాయకులు కూడా ఒకసారి అధికారం రుచి చూశాక నిరసన అన్న పదం కూడా వినడానికి ఇష్టపడరు అనడానికి ఇదొక మంచి ఉదాహరణ.ఇప్పటి పరిస్థితి తెలియదుగాని కొన్ని సంవత్సరాల క్రితం వరకు అమెరికాలో ఆ దేశాధ్యక్షుడి అధికారిక నివాసం వైట్ హౌస్ ప్రధానద్వారం ఎదురుగానే రోడ్డుకు అవతల, పలువర్గాలు తమ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉండేవి. ఎప్పుడు చూసినా అక్కడ తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని కూర్చున్నవాళ్లు రోజూ కనిపించేవాళ్లు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యంపట్ల విశ్వా సం, గౌరవంగల ఏ రాజకీయ వ్యవస్థ అయినా శాంతియుత పద్ధతుల్లో జరిగే నిరసనలను అనుమతించాల్సిందే. ఇంకా మాట్లాడితే ఇప్పుడు దేశంలో సమస్యల మీద గళం ఎత్తుతున్న తరం అసలు ఒకరి అనుమతి కోరడం ఏమిటని కూడా ధిక్కార స్వరం వినిపిస్తున్నది. 'నువ్వు చేస్తున్న తప్పులకు నిరసన వ్యక్తం చెయ్యడానికి నిన్నే అనుమతి కోరడం ఏమిటి, సమాచారం తెలుపుతాం, అంతే' అన్నది వారి వాదన.అధికారంలో ఉన్నవారికి అప్రియమైన విషయాలు తెలియకుండా ఉండేందుకు వారిచుట్టూ కొందరు వందిమాగధులు చేరుతూ ఉంటారు. వాళ్ల పని బయట కొంపలు అంటుకుపోతున్నా అంతా సవ్యంగానే ఉందని, ఏలిక పరిపాలన అద్భుతంగా ఉందని నమ్మించడమే. ఆయనను భ్రమల్లో ఉంచడమే. అలాంటి అసత్యాల్ని నమ్మి తర్వాత జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయిన రాజకీయపక్షాలు మనకు తెలుసు. నిరసనలు తమ దృష్టికి వస్తేనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవిటో తెలిసి వాటిని పరిష్కరించడానికి, పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించేందుకు అధికారంలో ఉన్నవారికి వీలవుతుంది. అలా కాని పక్షంలో అంతా బాగానే ఉందనుకున్నప్పుడు బయట జరిగే నష్టం మళ్ళీ ఎన్నికల ఫలితాలనాడు మాత్రమే తెలుస్తుంది.ప్రస్తుతం దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జెన్ జీ వివిధ సమస్యల మీద చేస్తున్న ఆందోళనలో భాగంగా తలపెట్టిన 'లెహరా దో తిరంగా' (త్రివర్ణ పతాకాన్ని ఎగరేద్దాం) అనే పిలుపునిచ్చింది.



# పారా ఆసియా క్రీడల్లో భారత్ విజయకేతనం



## టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా!

బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత పురుషుల క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ స్థానంలో ఓజా వ్యవహరించనున్నారు. మరోవైపు, మాజీ స్పిన్నర్ రమేష్ పవార్‌కు కూడా సెలక్షన్ కమిటీలో చోటు దక్కింది. మరి ఓజా నేతృత్వంలోని కమిటీ టీమిండియా ఎంపికలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

### రెండు స్వర్ణాలు.. ఒక రజతం కైవసం
### షూటింగ్‌లో మోనా అగర్వాల్‌కు పసిడి..
### అవనీ లేఖరాకు వెండి పతకం
### లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శన

**ఐచీ, అక్టోబర్ 19:** పారా ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తూ దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తున్నారు. సోమవారం జరిగిన పోటీల్లో భారత క్రీడాకారులు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకాన్ని సాధించి విజయభేరి మోగించారు. మహిళల షూటింగ్‌లో మోనా అగర్వాల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, అవనీ లేఖరా రజత పతకంతో మెరిశారు. మరోవైపు పురుషుల లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. **షూటింగ్‌లో భారత క్రీడాకారిణుల ఆధిపత్యం** మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 విభాగంలో భారత షూటర్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఫైనల్ పోటీలో మోనా అగర్వాల్ 250 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మరో భారత క్రీడాకారిణి అవనీ లేఖరా 249.6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకే విభాగంలో భారత క్రీడాకారిణులు తొలి రెండు స్థానాలను దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రీ కాంస్య పతకాన్ని సాధించారు. మోనా అగర్వాల్ తన అసాధారణ ప్రతిభతో గత పారా ఆసియా క్రీడల రికార్డును అధిగమించడం విశేషం. గతంలో



చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన పారా ఆసియా క్రీడల్లో అవనీ లేఖరా నమోదు చేసిన స్కోరును అధిగమిస్తూ మోనా అగ్రస్థానంలో నిలిచారు. ఈ విజయంతో భారత షూటింగ్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో తన సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. **లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్‌కు పసిడి** అథ్లెటిక్స్ విభాగంలోనూ భారత్‌కు మరో స్వర్ణ పతకం లభించింది. పురుషుల టీ47 లాంగ్‌జంప్ పోటీలో రెండుసార్లు పారాలింపిక్స్ రజత పతక విజేత నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ విభాగంలో తొలిసారిగా పోటీపడుతున్నప్పటికీ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా తన సత్తాను చాటుకున్నాడు. తన అత్యుత్తమ ప్రదర్శనగా 7.11 మీటర్ల దూరం దూకి ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకున్న నిషాద్ కుమార్, కొత్త



విభాగంలోనూ పతకాన్ని సాధించడం భారత క్రీడారంగానికి గర్వకారణంగా నిలిచింది. విభిన్న క్రీడా విభాగాల్లో పోటీపడుతూ పతకాలు సాధిస్తున్న భారత పారా క్రీడాకారులు తమ పట్టుదల, కఠోర శ్రమతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. **భారత క్రీడాకారులకు అభినందనలు** వైకల్యాలను అధిగమించి ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొంటూ అత్యుత్తమ ప్రదర్శనలు చేయడం పారా క్రీడాకారుల అంకితభావానికి నిదర్శనం. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ లక్ష్య సాధన కోసం వారు చేస్తున్న కృషి ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. షూటింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలు దేశ క్రీడాభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. రానున్న పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## జింబాబ్వేపై భారత మహిళల ఘనవిజయం



### • 2-0తో సిరీస్ కైవసం

**రాయ్‌పూర్:** జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో భారత మహిళల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ స్మృతి మంధాన 25 బంతుల్లో 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. చివరి టీ20లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భారత జట్టు భావిస్తోంది.

## విమానంలోనూ నిరాడంబరత చాటిన రాహుల్ ద్రవిడ్

### - అభిమానిని ఆప్యాయంగా పలకరించి ఆటోగ్రాఫ్.. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన నిరాడంబరతతో మరోసారి అభిమానుల మనసులు గెలుచుకున్నారు. క్రికెట్ మైదానంలో ప్రశాంతతకు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఆయన.. మైదానం బయట కూడా అదే హుందాతనాన్ని ప్రదర్శించారు. సాధారణ ప్రయాణికుడిలా విమానంలో ప్రయాణిస్తూ ఓ అభిమాని అడిగిన ఆటోగ్రాఫ్‌ను చిరునవ్వుతో అందించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. **విమానంలో ఊహించని ఆనందం** ముగ్గురు తోబుట్టువులు ఇండిగో విమానంలో ప్రయాణిస్తుండగా, అదే విమానంలో రాహుల్ ద్రవిడ్ ఉండటాన్ని గుర్తించారు. దీంతో వారు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వారిలో ఒకరు ధైర్యం చేసి ద్రవిడ్ వద్దకు వెళ్లి ఆటోగ్రాఫ్ కోరగా, ఆయన ఏమాత్రం అసహనం వ్యక్తం



చేయకుండా సంతకం చేసి ఇచ్చారు. ఈ అరుదైన సందర్భాన్ని మరో వ్యక్తి తన కెమెరాలో చిత్రీకరించాడు. విమాన ప్రయాణంలో జరిగిన ఈ చిన్న సంఘటన అభిమానులకు మధుర జ్ఞాపకంగా మిగిలింది. **విమానాశ్రయ బస్సులోనూ అదే నిరాడంబరత** విమాన ప్రయాణం ముగిసిన తర్వాత విమానాశ్రయంలోని బస్సులో కూడా ద్రవిడ్‌ను ఆ అభిమానులు మరోసారి చూశారు. ఆ సందర్భాన్ని సైతం వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు ద్రవిడ్ సాదాసీదా ప్రవర్తనను ప్రశంసిస్తున్నారు. ప్రముఖ క్రికెటర్ అయినప్పటికీ అభిమానుల పట్ల ఆయన చూపిన ఆదరణ అందరినీ ఆకట్టుకుంటోంది. **‘ఇందిరానగర్ కా గూండా.. నిజ జీవితంలో చాలా మంచివారు’** ఈ వీడియోకు అభిమానులు పెట్టిన వ్యాఖ్య మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో ఓ ప్రకటనలో ద్రవిడ్ కోపంగా నటిస్తూ చెప్పిన ‘ఇందిరానగర్ కా గూండా’ అనే సంభాషణ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రాచు ర్యం పొందింది. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ద్రవిడ్ ఆ ప్రకటనలో భిన్నమైన పాత్రలో కనిపిం చడంతో ఆ సంభాషణ అభిమానులకు గుర్తుండి పోయింది. తాజాగా విమానంలో ఆయన అభిమానితో ఆప్యాయంగా వ్యవహరించిన వీడియోకు అదే విషయా న్ని ప్రస్తావిస్తూ వ్యాఖ్యను జోడించారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో వీక్షణలు వచ్చాయి. ద్రవిడ్ ఆటోగ్రాఫ్ ఇచ్చిన తీరు, అభిమానులతో మాట్లాడిన విధానం నెటిజన్లను ఆకట్టు కున్నాయి. మైదానంలోనే కాకుండా సాధారణ జీవిత ంలోనూ తన వ్యక్తిత్వంతో అభిమానుల ప్రేమను పొం దుతున్న రాహుల్ ద్రవిడ్ మరోసారి వార్తల్లో నిలిచారు.

## భువీ రాకతో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలి



### - మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక సూచన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19:** భారత క్రికెట్ జట్టు పేస్ బౌలింగ్ విభాగంపై మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశారు. సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ జట్టులోకి తిరిగి రావడంతో జస్‌ప్రీత్ బుమ్రాపై పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రాను మూడు ఫార్మాట్లలోనూ నిరంతరం ఆడించకూడదని అభిప్రాయపడ్డారు. **భువీ అనుభవం జట్టుకు బలం** సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చిన భువనేశ్వర్ కుమార్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని రవిశాస్త్రి పేర్కొన్నారు. ఐపీఎల్‌లో అతడు చూపిన ప్రదర్శన, బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యం న్యూజిలాండ్ పరిస్థితులకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌తో పాటు టెస్టుల్లోనూ అతడికి అవకాశాలు కల్పించాలని సూచించారు. **బుమ్రా పనిభారంపై దృష్టి** బుమ్రా గాయాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రవిశాస్త్రి అన్నారు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తూ, వన్డేలు, టీ20ల్లో అవసరాన్ని బట్టి మాత్రమే ఆడించాలని సూచించారు. న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌లో బుమ్రా సేవలు కీలకమని పేర్కొన్నారు. **ప్రపంచకప్ సన్నాహకాలకు కీలకం** న్యూజిలాండ్ పర్యటన భారత జట్టుకు ఎంతో ముఖ్యమైనదని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో పాటు 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని తెలిపారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా పిచ్‌ల పరిస్థితుల్లో కొన్ని పోలికలు ఉండే అవకాశం ఉందని, అందువల్ల ఈ పర్యటనలో ఆటగాళ్ల ప్రదర్శన భవిష్యత్ ప్రణాళికలకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా ముగిసిన గుర్రపు స్వారీ పోటీలు



### • రాష్ట్ర స్థాయి అశ్వక్రీడల్లో యువ క్రీడాకారుల ప్రతిభాపాటవాలు

**హైదరాబాద్, అక్టోబర్ 19:** హైదరాబాద్‌లోని గండిపేట హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్ వేదికగా నిర్వహించిన రెండో తెలంగాణ రాష్ట్ర స్థాయి గుర్రపు స్వారీ పోటీలు ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ వయో విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. తెలంగాణ అశ్వక్రీడల సంఘం సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో గుర్రపు స్వారీ, గుర్రాలతో అడ్డంకులను అధిగమించే పోటీలు సహా పలు విభాగాల్లో క్రీడాకారులు పోటీపడ్డారు. **విభిన్న విభాగాల్లో పోటీలు** పోటీల్లో భాగంగా డ్రెస్సాజ్, షో జంపింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పిల్లలు, జూనియర్లు, యువ క్రీడాకారులు, ఓపెన్ విభాగాల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా తక్కువ ఎత్తులోని అడ్డంకులను దాటే పోటీలను ప్రారంభస్థాయి క్రీడాకారులకు అందుబాటులో ఉంచడంతో కొత్తగా ఈ క్రీడలోకి అడుగుపెట్టిన వారికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది. **యువ అశ్వక్రీడాకారుల సత్తా** పోటీల్లో భాగంగా నిర్వహించిన డ్రెస్సాజ్ విభాగంలో సిద్ధార్థ్ దత్తా, గౌతమ్ సంజయ్ సుజనాని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. పిల్లల విభాగంలో సిద్ధార్థ్ దత్తా విజేతగా నిలవగా, జూనియర్ విభాగంలో గౌతమ్ సంజయ్ సుజనాని అగ్రస్థానాన్ని సాధించారు. షో జంపింగ్ విభాగంలోనూ పలువురు క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. అబ్దుల్ మానన్ ఓపెన్ విభాగంలో విజయం సాధించగా, ఇతర విభాగాల్లోనూ యువ క్రీడాకారులు పతకాలు, బహుమతులు దక్కించుకున్నారు. **జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు** రాష్ట్ర స్థాయి పోటీలకు ముందు అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఇదే వేదికపై నిర్వహించిన జాతీయ అర్హత పోటీల్లో 18 మంది క్రీడాకారులు జూనియర్ జాతీయ అశ్వక్రీడల పోటీలకు అర్హత సాధించారు. రెండు రోజుల పాటు జరిగిన ఆ పోటీల్లో మొత్తం 58 ప్రదర్శనలు నమోదయ్యాయి. డ్రెస్సాజ్ విభాగంలో అనెట్ సలోమీ కాస్టిలినో 71.61 శాతం స్కోరుతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. తెలంగాణలో అశ్వక్రీడలను ప్రోత్సహించడం, యువ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# వారసుడి సినిమాలో సింహం ఓ మెరుపులా!



యంగ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ట దర్శకత్వంలో నందమూరి వారసుడు మోక్షజ్ఞ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఎంతో మంది దర్శకుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా? చివరికి -బింబిసార- ఫేం వశిష్ట వైపు నందమూరి బాలకృష్ణ మొగ్గు చూపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నందమూరి అభిమానుల్లో.. సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మోక్షజ్ఞ తొలి సినిమా కావడంతో ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించేందుకు వశిష్ట ప్రత్యేక కసరత్తులు చేస్తున్నారు. కథా చర్చల దగ్గరి నుంచి ప్రతీ విషయంలోనూ బాలయ్య స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అయితే మోక్షజ్ఞ లాంచ్ పర్ఫెక్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో సినిమాలో బాలకృష్ణ గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వబోతున్నారనే వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ గెస్ట్ రోల్ కేవలం సినిమాకు ఒక పవర్ ప్యాక్డ్ టేకాఫ్ లాగా మాత్రమే ఉంటుందని తెలుస్తోంది. 100 సార్లు అడిగితే గానీ.. సాధారణంగా స్టార్ హీరో వారసుడి లాంచ్ సినిమాలో కనిపిస్తే ఆ క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. అయితే స్క్రీన్ మీద బాలకృష్ణే ఎక్కువ సేపు కనిపిస్తే? అది డెబ్యూ హీరో అయిన మోక్షజ్ఞకు మైనస్‌గా మారుతుందనే జాగ్రత్తను వశిష్ట ముందుగానే ప్లాన్ చేసినట్లు సమాచారం. సీనియర్ హీరో స్థాయికి తగినట్లుగా సినిమా మొత్తం ఉంటే? కొత్త హీరో ఎలివేషన్ తగ్గే ప్రమాదం ఉందని భావించిన దర్శకుడు బాలయ్య పాత్రను కేవలం ఒక మెరుపులా.. సరిగ్గా ఇంట్రడక్షన్ కీలకమైన టేకాఫ్ సన్నివేశాలకే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారట్. ఈ గెస్ట్ రోల్ ద్వారా సినిమాకు కావాల్సినంత హైప్ రావడం ఖాయమని.. అదే సమయంలో మోక్షజ్ఞకు పూర్తి స్థాయి హీరోగా ప్రతిభను ప్రదర్శించడానికి తగినంత స్పేస్ దొరుకుతుందని తెలుస్తోంది. నందమూరి అభిమానుల అంచనాలను నిలబెడుతూనే మోక్షజ్ఞ సోలో హీరోగా టాలెంట్‌ను నిరూపించుకోవడానికి ఈ ప్లానింగ్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారుట. నందమూరి నట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత మోక్షజ్ఞ మీద ఉండటంతో ఆయన మేకోవర్, డ్యాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌ల విషయంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభం నుండి ఎంతో పకడ్బందీగా స్క్రిప్ట్ వర్క్ జరుపుకున్న ప్రాజెక్ట్ పై అంచనాలు అంతకంతకు పెరుగుతున్నాయి. బాలయ్య ఇచ్చే ఆ చిన్న మెరుపు సినిమాకు బిగ్గెస్ట్ ఓపెనింగ్స్‌ను తెచ్చిపెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని..ఆ తర్వాత సినిమాను పూర్తిగా మోక్షజ్ఞ తన భుజాలపై మోస్తారని తెలుస్తోంది.

## నాలుగు రోజుల్లోనే రూ.400 కోట్ల క్లబ్‌లోకి రజనీ..

### ఓవర్సీస్‌లో 'ధురంధర్ 2' రికార్డు బద్దలు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.424.25 కోట్ల వసూళ్లు సాధించింది. దీంతో రూ.400 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మరోవైపు 2026లో భారతీయ సినిమాల్లో ఓవర్సీస్ తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ క్రమంలో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'ను వెనక్కి నెట్టింది.

ఆదివారం ఒక్కరోజే 'జైలర్ 2' భారత్‌లో రూ.55.85 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. శనివారం వచ్చిన రూ.47.25 కోట్లతో పోలిస్తే ఆదివారం వసూళ్లు 18.2 శాతం పెరిగాయి. విడుదలైన తొలి రోజు రూ.59.70 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. రెండో రోజు రూ.37.10 కోట్లకు పరిమితమైంది. ఆ తర్వాత వారాంతంలో మళ్లీ పుంజుకుంది.ఇప్పటివరకు భారత్‌లో ఈ సినిమా నెట్ వసూళ్లు రూ.199.90 కోట్లకు చేరాయి. పన్నులతో కలిపిన దేశీయ వసూళ్లు రూ.234.25 కోట్లు కాగా.. విదేశాల్లో రూ.190 కోట్లు రాబట్టింది. దీంతో ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.424.25 కోట్లకు చేరినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి.విదేశీ మార్కెట్లో తొలి రోజు వసూళ్లలో 'జైలర్ 2' సుమారు రూ.57 కోట్లు సాధించింది. 'ధురంధర్ 2' తొలి రోజు రాబట్టిన రూ.52 కోట్లను అధిగమించింది. ఈ జాబితాలో రామ్‌చరణ్ నటించిన 'పెద్ది' రూ.28 కోట్లతో మూడో స్థానంలో ఉంది. విజయ్ 'జన నాయగన్' రూ.27.50 కోట్లు, మలయాళ చిత్రం 'దృశ్యం 3' రూ.25 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఆదివారం వసూళ్లలో తమిళ వెర్షన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ భాషలో రూ.39.95 కోట్ల నెట్ వసూళు వచ్చాయి. తెలుగు వెర్షన్ రూ.9.50 కోట్లు, హిందీ వెర్షన్ రూ.5.75 కోట్లు, కన్నడ వెర్షన్ రూ.65 లక్షలు రాబట్టాయి. అన్ని భాషల్లో కలిపి 15,473 ప్రదర్శనలకు సగటున 62 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. నాలుగు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన 'జైలర్ 2'కు ఇప్పుడు అసలు పరీక్ష మొదలుకానుంది. వారాంతపు జోరును వారం మధ్యలోనూ కొనసాగిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.



## పండుగ కళ ఉట్టిపడేలా శ్రీలీల వైబ్స్ దసరా వైబ్స్

దసరా వైబ్స్ ఒక రోజు ముందే వచ్చేసాయి. శ్రీలీల తన తాజా ట్రెడిషనల్ లుక్‌తో దసరా వైబ్స్ ని క్రియేట్ చేసింది. సోషల్ మీడియాలో మరోసారి అందరినీ మంత్రముగ్ధులను చేసింది. సంప్రదాయబద్ధమైన దుస్తులలో మెరిసిపోతూ.. పండుగ శోభను.. దసరా నవరాత్రుల కళను పర్ఫెక్ట్‌గా ప్రతి బింబించింది. నదిటిన బొట్టు.. క్లాసిక్ ఆభరణాలు.. రాజసం ఉట్టిపడే స్టైలింగ్‌తో డివైన్ బ్యూటీలా అలరించింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే కామెంట్ సెక్షన్ అభిమానుల ప్రేమతో, హార్ట్ ఎమోజీలతో నిండిపోయింది. తోటి సినీ ప్రముఖులతో పాటు లక్షలాది మంది ఫ్యాన్స్ -అందాల దేవత-, -ఎథీరియల్ క్వీన్- అంటూ ప్రశంసలు కురిపించారు. నెటిజన్లు తన అందమైన నవ్వుకి, ఆకర్షణీయమైన చూపులకు ఫిదా అవుతూ కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని చాటుకున్నారు. వెస్ట్రన్ వేర్ అయినా.. ట్రెడిషనల్ వేర్ అయినా తనదైన శైలిలో క్యారీ చేయడంలో శ్రీలీల దిట్ట. ఇండియన్ సినీ పరిశ్రమలో అత్యంత వర్సటైల్ ఫ్యాషన్ ఐకాన్లలో ఒకరిగా నిలిచిన ఈ భామ ఈ కొత్త ఫోటోషూట్‌లో ఎంతో సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో అలరించింది. క్లాసిక్ డిజైన్స్, మోడర్న్ టచ్‌ను సమన్వయం చేస్తూ ఈ అవుట్‌ఫిట్ ట్రెండింగ్‌గా మారింది. ఈ పండుగ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా శ్రీలీలకున్న స్టార్ పవర్‌ను మరోసారి నిరూపించింది. తన గ్లామర్, ఎనర్జిటిక్ యాక్టింగ్‌తో టాలీవుడ్ - సౌత్‌లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఈ బ్యూటీ తన ప్రతి లుక్‌తోనూ...వరుస సినిమాలతోనూ ఫ్యాన్స్ అంచనాలను మరింత పెంచేస్తోంది.

## స్టోరీ రివీల్ చేసిన విశ్వక్ సేన్!



సాధారణంగా ఒక సినిమా తెరకెక్కుతోంది అంటే కచ్చితంగా సినిమా అందరూ చూడాలి. అప్పుడే నిర్మాతకు డబ్బులు వస్తాయి.. అయితే కొంతమంది ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్ గా చేసుకొని సినిమాలు చేస్తూ కోట్లు కొల్లగొడుతుంటే.. మరి కొంతమంది మాస్ ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తూ సక్సెస్ అవుతున్నారు. అయితే ఇక్కడ తాను కూడా ఇందుకు అతీతం కాదు అని, తాను ప్రత్యేకించి జెన్జీ యువతను టార్గెట్ గా చేసుకొని సినిమా చేశాను అంటూ స్పష్టంగా వివరణ ఇచ్చారు విశ్వక్ సేన్ .. అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం ఫలక్నుమా దాస్ సినిమా తర్వాత అంతే కసితో కోపంతో తీస్తున్న చిత్రం కల్ట్ అని చెప్పిన విశ్వక్ సేన్.. అసలు ఈ సినిమా ఎవరిని టార్గెట్ గా చేసుకొని చేస్తున్నారు అనే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చారు. అసలు విషయంలోకి వెళ్తే.. కథ, స్క్రీన్ ప్లే, డైరెక్టర్, నటుడిగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం కల్ట్. ఈ సినిమా ట్రైలర్ ను రీసెంట్ గా విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. "జెన్ జీ ను టార్గెట్ గా చేసుకొని తీసిన సినిమా కల్ట్. ఇది ప్రతి ఒక్కరి కోసం తీసిన సినిమా కాదు.. ఈ విషయం నాకు స్పష్టంగా తెలుసుప్రతి ఒక్కరిని క్యాటగరైజ్ చేసుకుని తీసిన సినిమా కాదు. నాకు క్లియర్ విజన్ ఉంది . నేను కచ్చితంగా యువతను, జెన్ జీ ను టార్గెట్ గా చేసుకొని ఈ కల్ట్ సినిమా తెరకెక్కిస్తున్నాను. ముఖ్యంగా ప్రాజెక్టు ఎక్స్, స్క్విడ్ గేమ్ కలిస్తే కల్ట్. ఈ రెండు నా ఫేవరెట్ చిత్రాలు.. ఈ రెండు చిత్రాలను కలిపి తీసిన సినిమానే కల్ట్. గోవాలో ఒక ఇన్సిడెంట్ జరిగినప్పుడు.. నేను చాలా బాధపడ్డాను.. అక్కడ ఇద్దరు తెలుగు వాళ్ళను కొట్టి చంపేశారు. ముఖ్యంగా ఆ అంశం నన్ను మరింతగా ఆలోచింపజేసింది. ఆ తర్వాత కూడా గోవాలో నాన్ లోకల్ వాళ్లను ఎలా ట్రీట్ చేస్తారో చాలామందికి తెలుసు. నేను ఈ క్యారెక్టర్ రాస్తున్నప్పుడు మధ్యలో నాకు ఈ సంఘటన మరింత కలిచి వేసింది. ఈ సినిమాలో నేనొక పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషిస్తున్నాను. హైదరాబాదులో ఒక పోలీసు ఉంటాడు. మధ్యలో ఈ ఇన్సిడెంట్ వచ్చినప్పుడు ఆట మరో లెవెల్ కి వెళ్తుంది. ఈ డిఎస్పి సంకల్ప నాయక్ (విశ్వక్ సేన్) అనే వ్యక్తి హైదరాబాదు నుండి కావాలని గోవా కి పోస్టింగ్ తీసుకొని వెళ్తాడు. నాన్ లోకల్ ను ఎవరైనా కొడితే.. ఈ డిఎస్పి వాళ్ళని కొడుతూ ఉంటాడు. స్టెరాయిడ్స్ తీసుకున్న వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడో అలా.. ఇదే ఈ సినిమా.. అంటూ స్టోరీ కూడా రివీల్ చేశారు విశ్వక్ సేన్. చాలా క్లియర్ గా యువత, జెన్ జీ కోసమే ఈ మూవీ చేశానని, ఆయన క్లారిటీ ఇవ్వడం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇకపోతే ఇంతకు ముందు విడుదల చేసిన టీజర్ లో స్టోరీ గురించి చెబితే.. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ లో చూపించిన రక్తపాతం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యంగా సెన్సార్ హద్దులను మీరుతూ ఆర్.రేటెడ్ మూవీగా టాలీవుడ్ లో తెరకెక్కుతోందంటూ చెబుతున్న ఈ సినిమా అసలు జెన్ జీను ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.

## తెలంగాణ కోడలిని అంటూ నేషనల్ క్రష్ సగర్వంగా!



పాన్ ఇండియా లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి వినయంతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలతో బిజీగా ఉండే కథానాయికల్లో ఒకరిగా ఉన్నా? సాంప్రదాయాలకు, స్థానిక సంస్కృతికి రష్మిక ఇచ్చే గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో రష్మిక పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక తెలంగాణ మహిళలతో కలసి రష్మిక ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడటం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి.. ఆనందానికి గురిచేసింది. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య మహిళలతో కలిసి పాటలు పాడుతూ అడుగులు వేస్తూ వేడుకలను జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఒక స్టార్ హీరోయిన్ ఇలా వీధిలో అందరితో కలిసిపోవడం, స్థానిక పండుగలో పాలుపంచుకోవడం ఆమెలోని ఎంతో సింపుల్ స్వభావాన్ని ఆవిష్కరించింది. -నేను తెలంగాణ కోడలిని. తెలంగాణ ఇంటి ఆడపడుచునని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నాను- అని సంతోషంగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు చూపించే ఆప్యాయత, ప్రేమ తనకు ఎంతో ప్రత్యేకమైనవని, ఈ నేలతో తనకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని భావోద్వేగంతో వెల్లడించారు. ఈ మాటలు విన్న తెలంగాణ ప్రజలు, అభిమానులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సంస్కారవంతంగా ఉండటం చూసి విజయ్ దేవరకొండ నిజంగా ఎంతో లక్కీ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కుటుంబంతో.. ఆయన మూలాలతో రష్మికకు ఉన్న అనుబంధం గురించి ఇండస్ట్రీలో ఎప్పటినుంచో ఆసక్తికరమైన చర్చలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక తెలంగాణ సంస్కృతిని తన సొంత సంస్కృతిగా భావించి ఇంత గౌరవంగా బతుకమ్మ ఆడటం వారి బంధానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ప్రస్తుతం గ్లామర్ ప్రపంచంలో చాలామంది స్టార్లు తమ చుట్టూ ఒక ప్రత్యేకమైన సరిహద్దులను ఏర్పరచుకుని సామాన్యులకు దూరంగా ఉంటారు. కానీ రష్మిక మాత్రం తన వద్దకు వచ్చే అభిమానులతో, సామాన్య ప్రజలతో ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ ఉంటారు. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్నా? భారతీయ మూలాలను మర్చిపోకుండా ఇలా సాంప్రదాయ వేడుకలకు ప్రాధాన్యత ఇవ్వడం రష్మిక ప్రత్యేకతను చాటిచెబుతోంది. మొత్తానికి బతుకమ్మ పండుగ సందర్భంగా రష్మిక చూపించిన ఆప్యాయత, సింప్లిసిటీ తెలంగాణ మహిళల మనసులను దోచుకున్నాయి. తెలంగాణ సాంప్రదాయాన్ని ఇంత గొప్పగా గౌరవిస్తూ తెలంగాణ కోడలిని అని గర్వంగా ప్రకటించిన రష్మికకు స్థానిక ప్రజలు... అభిమానుల నుంచి మద్దతు లభిస్తోంది.